సాక్షి
రంగారెడ్డి
మంగళవారం ı 6 ı ఫిబ్రవరి ı 2024



నులిపురుగుల నివారణతో..
నులిపురుగులను నివారిస్తేనే చిన్నారుల ఆరోగ్యం మెరుగవుతుందని డిప్యూటీ డీఎం హెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. 8లో▸



గంజాయి పట్టివేత
గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్టు శంకర్‌పల్లి ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి వెల్లడించారు. 8లో▸



విద్యుత్ కట్ చేశారని..
తన వ్యవసాయ బోరుకు విద్యుత్ కనెక్షన్ కట్ చేశారనే మనస్తాపంతో ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. 8లో▸

న్యూస్‌రీల్

శంకర్‌పల్లి సబ్ రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు

శంకర్‌పల్లి: మున్సిపల్ పరిధిలో రూ.60కోట్ల విలువ చేసే భూమి రిజిస్ట్రేషన్ వ్యవహారంలో అక్రమాలు జరిగినట్లు తేలడంతో సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేస్తూ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ అండ్ ఇన్‌స్పెక్టర్ (ఐజీ) నవీన్‌మిత్తల్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యవహారంలో హైదరాబాద్ జిల్లా రిజిస్ట్రార్ భార్యతో పాటు మరికొంత మంది పేర్లు ఉన్నట్లు అధికారులు తేల్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నశంకర్‌పల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 334,335లో 5.12 ఎకరాలు భూమికి ప్రోగ్రెసివ్ ఆగ్రో సర్వీసెస్ పేరుతో 2023 మార్చి, 17న శంకర్‌పల్లి తహసీల్దార్ నయిముద్దీన్ నుంచి నాలా ధ్రువీకరణ పత్రాన్ని అసలైన భూ యజమాని ముళ్లపూడి వీరవెంకట సత్యనారాయణ పొందాడు. భూమి తమదేనని.. తన తండ్రి పేరున ఉందని.. యజమాని తానే అంటూ ముళ్లపూడి వరప్రసాద్ నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌తో 2024 జనవరి 20న నీలం గౌడ్, రవీందర్ కుమార్, పినిమెల్లి ప్రశాంత్, కస్తూరి హరిరంజనికి విక్రయించాడు. దీంతో నీలం గౌడ్, ఇతరులు రంగారెడ్డి జిల్లా కోర్టును ఆశ్రయించారు. తాము కొనుగోలు చేసిన భూమిలోకి ముళ్లపూడి వీరవెంకట సత్యనారాయణ, ప్రోగ్రెసివ్ ఆగ్రో సర్వీసెస్ సభ్యులెవరూ రాకూడదని ఇంజెక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నారు. బాధితుడు ముళ్లపూడి వీరవెంకట సత్యనారాయణ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ అక్రమమని తేలడంతో ఉన్నతాధికారులు శంకర్‌పల్లి రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు వేశారు.

ఎమ్మెల్యే కాలె యాదయ్యకు సబితారెడ్డి పరామర్శ




చేవెళ్ల: అనారోగ్యంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి సోమవారం పరామర్శించారు. ఆమె తనయుడు పి.కార్తీక్‌రెడ్డితో కలిసి వెళ్లారు. ఎమ్మెల్యే ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని ఆస్పత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

నేడు అమీర్‌పేట్‌కు కిషన్‌రెడ్డి రాక

మహేశ్వరం: మండల పరిధిలోని అమీర్‌పేట్‌కు మంగళవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి రానున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు మాధవాచారి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'గావ్ చలో అభియాన్' కార్యక్రమంలో భాగంగా కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు ఏవిధంగా చేరుతున్నాయో చెప్పడం కోసం రానున్నట్లు తెలిపారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అనుమతి లేని ఇంజక్షన్లు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

శంషాబాద్ రూరల్ : రోగులకు సర్జరీ కోసం అత్యవసర సమయాల్లో వినియోగించే ఇంజక్షన్లను ఎలాంటి అనుమతి లేకుండా విక్రయిస్తున్న ఇద్దరిని ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 30 ఇంజక్షన్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మెఫెంటర్‌మినే సల్ఫేట్ ఇంజక్షన్లను కార్డియాక్ సర్జరీ సమయంలో రోగులకు వాడుతుంటారు. వీటిని కొంతమంది బాడీ బిల్డర్లు తమ కండలు కనిపించడానికి వినియోగిస్తుంటారు. దీని కారణంగా ఆరోగ్య సమస్యలు ఎదురవుతుంటాయి. అయితే పహాడీషరీఫ్ ప్రాంతానికి చెందిన ఎండీ అజీజ్ మోహియుద్దీన్ ఏసీ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈ ఇంజక్షన్ల వాడకంపై అవగాహన ఉన్న ఇతను మార్కెట్లో వాటికి ఉన్న డిమాండ్‌ను గమనించి విక్రయించేందుకు నిర్ణయించుకున్నాడు. పహాడీషరీఫ్‌కు చెందిన ఎండీ అక్రమ్‌తో కలిసి దందాకు పూనుకున్నారు. సోమవారం వీరిద్దరు మండలంలోని సంఘీగూడ చౌరస్తా వద్ద ఇంజక్షన్ల విక్రయించేందుకు నిలబడ్డారు.సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ, శంషాబాద్ పోలీసులు వారిని పట్టుకుని విచారించారు. వారి వద్ద 30 ఇంజక్షను బాటిళ్లు, 4 సిరంజీ నీడిల్స్, మూడు ఫోన్లు, రూ.3,950 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారి బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.27,000ను సీజ్ చేశారు. ఇంజక్షన్లను రూ.200కు కొనుగోలు చేసి రూ.1,500 నుంచి రూ.2,000 వరకు విక్రయిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇండస్ట్రియల్!



సిద్ధాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్క్ కోసం ప్రభుత్వం గుర్తించిన భూమి

- కొత్తూరు మండలం సిద్ధాపూర్, పెంజర్లలో రెండు పారిశ్రామికవాడల ఏర్పాటుకు గత ప్రభుత్వ నిర్ణయం
- 450 ఎకరాల భూసేకరణ లక్ష్యం
- ఇప్పటివరకు సేకరించింది 330.34 ఎకరాలు
- నేటికీ ప్రారంభం కాని పనులు
- నిరుద్యోగుల ఎదురుచూపులు

కొత్తూరు: రాష్ట్ర రాజధానికి అతి చేరువలో.. అంతర్జాతీయ విమానాశ్రయానికి కూతవేటు దూరంలో.. రోడ్డు, రైలు మార్గాలు మెండుగా ఉండడంతో కొత్తూరు మండలం పారిశ్రామిక కారిడార్‌గా దినాదినాభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే ఇక్కడ పలు బహుళ జాతి పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. కొత్తగా మండలంలోని సిద్ధాపూర్‌లో 330, పెంజర్లలో 120 ఎకరాల్లో మరో రెండు పారిశ్రామికవాడలను(ఇండస్ట్రియల్ పార్క్) ఏర్పాటు చేసేందుకు రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. దానికి తోడు అప్పటి ఐటీశాఖ మంత్రి కేటీఆర్ పలు సందర్భాల్లో సిద్ధాపూర్‌లో ఏర్పాటు చేసే పారిశ్రామికవాడలో ఎక్కువగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఐటీ సెక్టార్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. భూసేకరణ చేపట్టి రెండేళ్లు గడుస్తున్నా నేటికీ అక్కడ ఎలాంటి పనులు ప్రారంభం కాలేదు.

టీఎస్‌ఐఐసీకి బదలాయింపు

ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు మొత్తం 450 ఎకరాలు సేకరించాలని నిర్ణయించారు. సిద్ధాపూర్ శివారులో 252 ,278, 361 సర్వే నంబర్లలోని 330.34 ఎకరాల్లో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములను టీఎస్ఐఐసీకి అధికారులు బదలాయించారు. 330.34 ఎకరాల్లో 97.24 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా మిగతా 240 ఎకరాలు అసైన్డ్ పట్టాలున్న రైతుల నుంచి సేకరించారు. పెంజర్ల గ్రామంలోని సర్వే నంబర్ 389లో ఉన్న అసైన్డ్ రైతుల నుంచి సుమారు 120 ఎకరాలు సేకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే కొందరు రైతులకు నోటీసులు ఇవ్వడంతో పాటు రెవెన్యూ అధికారులు అసైన్డ్ భూములకు సర్వేలు సైతం చేపట్టి రైతుల వివరాలు సేకరించారు. సిద్ధాపూర్‌తో పాటు పెంజర్లలో సేకరిస్తున్న భూములను ప్రభుత్వం టీఎస్ఐఐసీకి బదలాయించింది.

వలసల నివారణకు..

పాలమూరు జిల్లా నుంచి వలసలను అరికట్టి స్థానికంగా వారికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో 1976లో అప్పటి ప్రభుత్వం మండలకేంద్రం సమీపంలో పారిశ్రామికవాడను నెలకొల్పింది. ప్రస్తుతం పారిశ్రామికవాడతో పాటు మండలంలో 120 వరకు మధ్య, చిన్న తరహా, పదుల సంఖ్యలో భారీ పరిశ్రమలు కొనసాగుతున్నాయి. ఈ పరిశ్రమల్లో స్థానికులతో పాటు బీహార్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్‌కు చెందిన వేలమంది కార్మికులు విధులు నిర్వర్తిస్తూ ఉపాధి పొందుతున్నారు. దీంతో పాటు ప్రస్తుతం సిద్ధాపూర్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు కానున్నట్లు ప్రచారం జరుగుతుండడంతో ఉపాధిపై స్థానికులకు మరిన్ని ఆశలు చిగురిస్తున్నాయి. పూర్తి స్థాయిలో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటైతే వేల సంఖ్యలో ఉపాధి లభిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసే పరిశ్రమల్లో ఉపాధి కోసం అర్హత ఉన్న స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని భూములు కోల్పోయిన రైతులు కోరుతున్నారు.

ఉపాధి కల్పించాలి



గతంలో కొత్తూరులో ఏర్పాటు చేసిన పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో పలు పరిశ్రమల నిర్వాహకులు పెద్దగా స్పందించలేదు. కొత్తగా ఏర్పాటవుతున్న పారిశ్రామికవాడలోని పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగ యువతకు ప్రాధాన్యత కల్పించాలి.

– పానుగంటి పర్వతాలు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు

సైనిక్‌స్కూల్ ఏర్పాటు చేస్తాం



గతంలో జరిగిన భూసేకరణ ప్రక్రియలో చాలా వరకు అక్రమాలు చోటు చేసుకున్నాయి. కోట్లలో ప్రభుత్వ నిధులు దుర్వినియోగమయ్యాయి. సిద్ధాపూర్‌లో రైతుల నుంచి గత ప్రభుత్వం సేకరించిన భూముల్లో సైనిక్‌స్కూల్ ఏర్పాటు కోసం కృషి చేస్తున్నాం. ప్రజల అవసరాలకు ఉపయోగపడే ప్రాజెక్టులను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటాం.

– వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక

అర్జీలకు సత్వర పరిష్కారం

కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం చూపుతామని కలెక్టర్ శశాంక తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి అర్జీలు సమర్పించేందుకు తరలివచ్చారు. సమస్యల ను కలెక్టర్ శశాంక, అడిషనల్ కలెక్టర్ భూపాల్ రెడ్డికి విన్నవించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా అధికారులు, మండల అధికారులు, మున్సిపల్ అధికారులు ప్రతి సోమ వారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి తప్పకుండా హాజరుకావాలని అన్నారు. ఫిర్యాదులకు ప్రత్యేక రిజిస్టర్ కేటాయించి.. పరిష్కరించబడినవి ఎన్ని, పెండింగ్‌లో ఉన్నవి ఎన్ని నమోదు చేయాలన్నారు. పంచాయతీలకు కేటాయించిన ప్రత్యేక అధికారులకు ఈ నెల 6న ఓరియంటేషన్ ట్రెనింగ్ ప్రోగ్రాం ఉంటుందన్నారు. ఫిబ్రవరి 7 నుంచి 14 వరకు ప్రతి గ్రామంలో శానిటైజేషన్ డ్రైవ్ చేపట్టాలని చెప్పారు. ఈ వారం 158 అర్జీలు వచ్చాయని, వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేయాలని సీనియర్ సిటిజన్ గ్యార భూపాల్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేశారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

షాద్‌నగర్ రూరల్: అత్యవసర సమయాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని 108 జిల్లా ప్రోగ్రాం మేనేజర్ వసంత్‌పాపయ్య అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం 108, 102 వాహనాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 108 అంబులెన్స్‌లో ఆక్సిజన్‌తో పాటు ప్రథమ చికిత్సకు కావాల్సిన అన్ని వస్తువులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు రికార్డులను నమోదు చేయాలన్నారు. అత్యవసర సమయాల్లో వచ్చిన కాల్స్‌కు వెంటనే స్పందించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ రమేశ్, ఈఎంటీ రాజేశ్వర్, పైలెట్ దీపక్, కెప్టెన్ రాఘవేందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

బ్యాంకర్లు ఉదారంగా వ్యవహరించాలి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: బ్యాంకర్లు పంటల ఆర్థిక స్థాయి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) నిర్ణయంలో ఉదారంగా వ్యవహరించాలని కలెక్టర్ శశాంక అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లాల బ్యాంకర్లు, ఎల్డీఎంలు, వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పశుసంవర్ధక, అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయా పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఎక్కువగా ఇస్తే రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. బ్యాంకులు ఇచ్చే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ మొత్తాన్ని పెంచినట్లయితే ఎకరాకు వచ్చే రుణ సాయం సైతం పెరుగుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఇదే విషయాన్ని రాష్ట్ర స్థాయికి ప్రతిపాదించాలని సూచించారు. అన్ని రకాల పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ సానుకూలంగా ఇచ్చేందుకు బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో డీసీసీబీ సీఈవో భాస్కర సుబ్రహ్మణ్యం, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి అంజిల్ప, మత్స్యశాఖ అధికారి సుకీర్తి, వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, ఉమ్మడి జిల్లాల సెరికల్చర్, ఉద్యాన శాఖల అధికారులు, ఎల్డీఎంలు, నాబార్డ్ అధికారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బంది వేతనాలు పెంచండి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్

ఇబ్రహీంపట్నం రూరల్: కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతుల్లో పని చేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి వేతనాలు పెంచాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కిషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. తెలంగాణ వ్యాప్తంగా గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో వేల మంది కార్మికులు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్‌పే తదితర పద్ధతుల్లో ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. పనికి భద్రత లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, నాయకులు ఈ.నర్సింహ, టి.నర్సింహ, ఎం.సత్యనారాయణ, హంసమ్మ, సుభాష్, రవి, సురేందర్, రాజు, మేతరి దాసు, మైసయ్య, రవికుమార్, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

మా ఇళ్లు మాకు ఇప్పించండి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వం తమకు కేటాయించిన ఇళ్లను ఇతరులు కబ్జా చేశారని.. వారిని తక్షణమే అక్కడి నుంచి ఖాళీ చేయించాలని కోరుతూ పలువురు బాధితులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. నిలువ నీడలేని నిరుపేదలకు ప్రభుత్వం 2018లో జేఎన్ఎన్‌యూఆర్ఎం, వాంబే పథకం కింద పక్కా ఇళ్లను మంజూరు చేసిందని.. కర్మన్‌ఘాట్ నందనవనం ఫేజ్–3లో 512 మందికి ఇళ్లను కేటాయించిందని తెలిపారు. తమకు కేటాయించిన ఇళ్లలో ఇతరులు అక్రమంగా చొరబడి ఆక్రమించుకున్నారని, అదేమని ప్రశ్నిస్తే భౌతిక దాడులకు దిగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ ఇళ్లను కబ్జా చేసిన వారికి 2013లోనే ఇతర ప్రాంతాల్లో ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసిందని, వారు వాటిని అమ్ముకున్నారని ఆరోపించారు. రాత్రికి రాత్రే తలుపులు, తాళాలు పగలగొట్టి తమకు కేటాయించిన వాటిని కబ్జా చేయడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. అనంతరం కలెక్టర్ శశాంక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రాథోడ్, రాజ్‌కుమార్, మోహన్, రాజు, మోతిలాల్, పద్మ, సీత, ఆస్మబేగం, మాధవి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలనూ వదలట్లేదు!

- గ్యాస్, ఇంధనం తరలింపు వాహనాలపై 'ట్రాఫిక్' ఆంక్షలు
- పగటిపూట రవాణాకు అనుమతి నిరాకణ
- రాత్రి పూట జరుగుతున్న సరఫరా అంతంతే..
- నగరంలో గ్యాస్, ఇంధనం పంపిణీపై తీవ్ర ప్రభావం



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరంలో 'పగటి పూట' నిత్యావసరాల రవాణాపై సైతం ఆంక్షలు తప్పడం లేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీసులు పగటి పూట నిత్యవసరాలైన వంట గ్యాస్, ఇంధనం సరఫరా చేసే భారీ వాహనాలను సైతం అడ్డుకోవడం విస్మయానికి గురిచేస్తోంది. గత నెలలో ట్రాన్స్‌పోర్టు సమ్మె కొంత ప్రభావం చూపగా, తాజాగా పగటి పూట సిటీలో భారీ వాహనాలకు నో ఎంట్రీ అమలు చేస్తుండడంతో.. ఇంధన ఉత్పత్తుల రవాణాపై తీవ్ర ప్రభావం పడుతోంది. రాత్రిపూట అనుమతి ఉన్నా.. రవాణా మాత్రం అంతంతమాత్రంగా తయారైంది. ఏకంగా ఆయిల్ కంపెనీల ప్రతినిధులు పోలీసు ఉన్నతాధికారులను కలిసి లోడ్ వాహనాల అడ్డిగింపును దృష్టికి తీసుకెళ్లినా.. ఫలితం లేకుండా పోయింది. ఆయిల్ కంపెనీల టెర్మినల్స్‌లో గ్యాస్, ఇంధనం నిల్వలు పుష్కలంగా ఉన్నా.. రవాణా ఆంక్షలతో వచ్చిన సరుకును వచ్చినట్లే పంపిణీ జరుగుతుండటంతో గోదాములు వెలవెలబోతున్నాయి. రాత్రి పూట సరఫరాతో పెట్రోల్, డీజిల్ బంకుల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా.. వంట గ్యాస్ పంపిణీ మాత్రం చుక్కలు చూపిస్తోంది.

రీఫిల్ డిమాండ్ లక్షన్నరపైనే..

మహానగరంలో దినసరి వంట గ్యాస్ డిమాండ్ సుమారు లక్షన్నర ఎల్పీజీ సిలిండర్లపైనే ఉంటుంది. తాజా పరిస్థితులతో పంపిణీ మాత్రం అంతంతమాత్రంగా తయారైంది. మూడు ప్రధాన చమురు సంస్థలకు చెందిన 125 ఏజెన్సీల పరిధిలో గృహోపయోగ వంట గ్యాస్ కనెక్షన్లు సుమారు 30 లక్షలపైనే ఉన్నాయి. మరో వైపు వాణిజ్య అవసరాలకు సైతం లక్షల వరకు సిలిండర్ల డిమాండ్ ఉంటుంది. పగటి పూట రవాణాపై అంక్షలు వంటగ్యాస్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది.

ఎల్పీజీ లోడ్ వాహనాలను అనుమతించాలి



సిటీలో పగటి పూట కూడా ఎల్పీజీ లోడ్ వాహనాలను అనుమతించాలి. భారీ వాహనాలకు నో ఎంట్రీ పేరుతో ఎల్పీజీ సిలిండర్ల లోడ్‌లను అడ్డుకోవడం తగదు. ఇప్పటి వరకు ఇలాంటి పరిస్థితి ఎదురుకాలేదు. శివార్లలోని టెర్మినల్స్ నుంచి నగరంలోకి వస్తున్న సిలిండర్ల లోడ్ వాహనాలను పోలీసులు అడుగడుగునా అడ్డుకుని నిలిపివేస్తున్నారు. రాత్రి పూట మాత్రమే అనుమతిస్తున్నారు. దీంతో వంట గ్యాస్ పంపిణీపై తీవ్ర ప్రభావం చూపుతోంది. తక్షణమే ఎల్పీజీ వాహనాలను మినహాయించాలి.

– అశోక్ కుమార్, అధ్యక్షుడు, వంట గ్యాస్ డీలర్ల సంఘం, హైదరాబాద్



నృత్య విలాసం

అద్భుతమైన నృత్య భంగిమలు.. రీతులతో నాట్యకారిణులు అలరించారు. హిరణ్మయి నృత్యాలయం 10వ వార్షికోత్సవం సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నృత్యప్రదర్శనలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకున్నాయి.

ఆ చానల్‌పై చర్యలు తీసుకోండి

ఆమనగల్లు: అనుచిత వ్యాఖ్యలు చేసిన ఓ యూట్యూబ్ చానల్ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమనగల్లు పీఎస్‌లో సోమవారం ఎస్‌ఐ బాల్‌రామ్‌కు చానల్ నిర్వాహకుడు కత్తి పద్మారావుపై ఫిర్యాదు చేశారు. ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి నాయకులు వినోద్, కృష్ణ, రాజు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం



మాట్లాడుతున్న డాక్టర్ జయలక్ష్మి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి

షాద్‌నగర్: నులిపురుగులను నివారిస్తేనే చిన్నారుల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. ఫిబ్రవరి 12న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణంలో ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో డివిజన్ పరిధిలోని వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఎంపీడీఓలు, ఎంఈఓలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్య సంరక్షణ కోసం వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 12న చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వైద్యాధికారులు, సిబ్బంది చిన్నారుల తల్లిదండ్రులకు నులి పురుగుల నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు. డివిజన్‌లో ఏడాది నుంచి 19 ఏళ్ల చిన్నారులు మొత్తం 85,776 మంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఏడాది నుంచి రెండేళ్ల పిల్లలకు సగం టాబ్లెట్, మూడు నుంచి 19 ఏళ్ల పిల్లలకు ఒక టాబ్లెట్ వేయాలని సూచించారు. ఈ మాత్రలను పిల్లలు భోజనం చేసిన తర్వాత మింగించాలని సూచించారు. అదేవిధంగా ఫిబ్రవరి 13 నుంచి 18 వరకు తొమ్మిది నెలల చిన్నారుల నుంచి ఐదేళ్ల పిల్లలకు విటమిన్ ఏ సొల్యూషన్ వేయాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్య సంరక్షణపై తల్లిదండ్రులు, వైద్యాధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణాలకే ప్రమాదమని అన్నారు. ఈ సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ శంకర్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన డీసీఎం

ప్రయాణికుడి మృతి

యాచారం: అతివేగంగా వెళ్తున్న డీసీఎం ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో ఓ ప్రయాణికుడు మృతి చెందాడు. ఈ ఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ సైదయ్య తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా కిసాన్‌పల్లికి చెందిన ఏసు(37) నల్లగొండ జిల్లా దేవరకొండ డిపో బస్సులో మాల్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గున్‌గల్ గేట్ వద్ద యాచారం నుంచి ఇబ్రహీంపట్నం వైపు ప్రయాణిస్తున్న డీసీఎం బస్సును బలంగా ఢీకొట్టింది. దీంతో వెనుక సీట్లు కూర్చున్న ఏసు తలకు తీవ్రగాయాలై మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

గుర్తు తెలియని యువతి మృతదేహం లభ్యం



శంకర్‌పల్లి: మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ గుర్తుతెలియని యువతి శవం లభ్యమైంది. ఈ ఘటన జనవాడ గ్రామంలో సోమవారం ఉదయం వెలుగుచూసింది. ఎస్‌ఐ కోటేశ్వర్ రావు తెలిపిన ప్రకారం.. గ్రామ శివారులోని బీరప్ప ఆలయ పరిసరాల్లో గుర్తు తెలియని ఓ యువతి శవం గుర్తించి పోలీసులు సమాచారం ఇచ్చారు. పోలీసుల పంచనామాలో యువతి కుడి చేయి విరిగినట్లు గుర్తించారు. ఒంటిపై తెలుపు రంగు ప్యాంట్, నలుపు టీ షర్ట్, గులాబీ రంగు టాప్ ధరించి ఉందన్నారు. ఎవరైనా సంబధీకులు ఉంటే పోలిస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రాణం తీసిన నిర్లక్ష్యం

- ఓవర్‌లోడ్, అతివేగంతో అదుపు తప్పిన ఆటో
- వృద్ధుడి మృతి, పలువురికి గాయాలు



కిష్టయ్య మృతదేహం

మొయినాబాద్: అతివేగంగా వెళ్తున్న ఆటో బోల్తా పడిన సంఘటనలో ఓ వృద్ధుడు మృతిచెందగా పలువురు గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం కేతిరెడ్డిపల్లి గేటు సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ రిసార్ట్ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. కేతిరెడ్డిపల్లికి చెందిన అనిమోని కిష్టయ్య(70) సాయంత్రం 5 గంటల సమయంలో మొయినాబాద్ వెళ్లేందుకు ఆటో ఎక్కాడు. అప్పటికే ఆటోలో మరో పది మంది మహిళలు ఉన్నారు. గ్రామం నుంచి మొయినాబాద్‌కు బయలుదేరిన వాహనం అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా అదుపుతప్పి బోల్తా పడింది. ఇందులో ప్రయాణిస్తున్న కిష్టయ్యకు తీవ్రంగా గాయపడగా.. ఆయన కూతురు సంతోష స్వల్పంగా గాయపడింది. ఓ యువతికి కాలు విరగగా, మరో ముగ్గురు మహిళలకు గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన కిష్టయ్యను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను ఆస్పత్రికి, కిష్టయ్య మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కడుపు నొప్పి భరించలేక..

రైతు బలవన్మరణం

చేవెళ్ల: కడుపునొప్పి భరించలేక ఓ రైతు ఇంట్లో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని జాలగూడలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండలంలోని అల్లవాడ అనుబంధ గ్రామం జాలగూడకు చెందిన ఖానాపురం సత్యనారాయణరెడ్డి(48) వ్యవసాయం, కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం ఉదయం పనులకు వెళ్లకుండా ఇంటివద్దే ఉన్నాడు. ఇది గమనించిన వరసకు పిన్ని అయిన కాంతమ్మ ఏమైందని ప్రశ్నించగా.. కడుపునొప్పిగా ఉందని చెప్పాడు. అనంతరం బాధ భరించలేక ఇంట్లోనే ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని స్థానికుల సాయంతో చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ కనెక్షన్ కట్ చేశారని..

మనస్తాపంతో రైతు ఆత్మహత్యాయత్నం



రైతును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంకర్

కొందుర్గు: తన వ్యవసాయ బోరుకు విద్యుత్ కనెక్షన్ కట్ చేశారనే మనస్తాపంతో ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన తంగెళ్లపల్లిలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెరుమాల్‌రెడ్డికి మూడెకరాల భూమి ఉంది. వ్యవసాయం కోసం ఇటీవల కొత్తగా బోరు వేయించాడు. విద్యుత్ కనెక్షన్ కోసం డీడీ చెల్లించి, అనుమతులు పొందాడు. ట్రాన్స్‌కో అధికారులు పెరుమాల్‌రెడ్డి బోరుకు కనెక్షన్ ఇచ్చారు. అయితే గ్రామానికి చెందిన మరికొందరు రైతులు ఆక్షేపణ తెలపడంతో అధికారులు తిరిగి కనెక్షన్ తొలగించారు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన ఆదివారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అతన్ని శంషాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్‌ను వివరణ కోరగా పెరుమాల్‌రెడ్డి డీడీ చెల్లించింది, విద్యుత్ కనెక్షన్ తీసుకున్నదీ వాస్తవమేనని తెలిపారు. సదరు ట్రాన్స్‌ఫార్మర్‌పై సామర్థ్యానికి మించి కనెక్షన్లు ఉండటంతో.. ఓవర్ లోడ్ కారణంగా అంతకు ముందే కనెక్షన్లు ఉన్న రైతుల బోరు మోటర్లు నడవడం లేదని, దీంతో కొత్త కనెక్షన్‌ను తొలగించారని చెప్పారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సోమవారం ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు.

చాక్లెట్ ఆశచూపి..

- చిన్నారిపై అఘాయిత్యం
- వృద్ధుడికి దేహశుద్ధి
- పోక్సో చట్టం కింద కేసు

షాద్‌నగర్ రూరల్: నాలుగేళ్ల చిన్నారికి చాక్లెట్ ఆశచూపి అఘాయిత్యానికి పాల్పడిన వృద్ధుడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటన పట్టణంలోని అయ్యప్ప కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. పట్టణ సీఐ ప్రతాప్‌లింగం తెలిపిన ప్రకారం.. అయ్యప్ప కాలనీలో ఓ నిరుపేద కుటుంబం అద్దె ఇంట్లో నివాసం ఉంటుంది. రోజు మాదిరిగానే చిన్నారి తండ్రి పనికి వెళ్లగా.. బాలికను అమ్మమ్మ వద్ద ఉంచి తల్లి ఇళ్లలో పనిచేసేందుకు వెళ్లింది. ఆ చిన్నారి ఆడుకుంటూ రోడ్డుపైకి వచ్చింది. అదే కాలనీలో నివాసం ఉంటున్న పెంటయ్య(66) పసిపాపకు చాక్లెట్ ఇస్తానని ఎత్తుకుని ఇంట్లోకి తీసుకుని వెళ్లాడు. తనపై కూర్చో పెట్టుకుని అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఇదే విషయం బాలిక తల్లితో చెప్పింది. దీంతో విషయం తెలుసుకున్న కాలనీ వాసులు పెంటయ్యకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గంజాయి పట్టివేత

ఇద్దరి అరెస్టు



కొందుర్గు: లాల్‌పహాడ్ చౌరస్తాలో గంజాయిని తూకం వేస్తున్న పోలీసులు

శంకర్‌పల్లి: గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని శంకర్‌పల్లి ఎస్సై సంతోష్‌రెడ్డి తెలిపారు. మహారాష్ట్రలోని పర్భాని జిల్లా గంగాకేగ్ గ్రామానికి చెందిన శ్యామ్‌వైద్యనాథ్ గైక్వాడ్, కౌస భాయ్ సోగేవాడు మరో ఇద్దరితో కలిసి విశాఖపట్నం నుంచి శంకర్‌పల్లి మీదుగా హైదరాబాద్‌కు 31 కిలోల 300 గ్రాముల గంజాయిని తరలిస్తున్నట్లు వచ్చిన ముందస్తు సమాచారంతో దాడులు చేశారు. సోమవారం శంకర్‌పల్లి ప్రధాన చౌరస్తా వద్ద తనిఖీలు నిర్వహించి గంజాయిని సీజ్ చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారని ఎస్సై తెలిపారు. కాగా మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు వివరించారు.

యువకుడి వద్ద 440గ్రాముల గంజాయి లభ్యం

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం లాల్‌పహాడ్ చౌరస్తాలో ఓ యువకుడి వద్ద 440 గ్రాముల గంజాయి లభించినట్లు ఎస్‌ఐ సక్రమ్ తెలిపారు. వివరాల ప్రకారం ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో లాల్‌పహాడ్ చౌరస్తాలో అనుమానస్పదంగా కనిపించిన ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా 440 గ్రాముల గంజాయి లభ్యమైంది. గంజాయిని సీజ్ చేసి నిందితుడి వద్ద సెల్‌ఫోన్, రూ.500నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని మధ్యప్రదేశ్ రాష్ట్రం, రీవా జిల్లా, షాయిపూర్ మండలం, దేవరా గ్రామానికి చెందిన వికాస్ పటేల్(19) గా గుర్తించారు. కొంతకాలంగా వనంపల్లి శివారులోని జీబీ బేకర్స్‌లో పనిచేస్తున్నారు. నిందితుడిని సోమవారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సక్రమ్ తెలిపారు.

స్కూటీని ఢీకొట్టిన టిప్పర్

మహిళ దుర్మరణం




లక్ష్మి(ఫైల్)

మీర్‌పేట: టిప్పర్ వెనుక చక్రాల కింద నలిగి మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ దుర్ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా బూత్‌పూర్ మండల మద్దిగట్ల గ్రామానికి చెందిన దుపల్లి లక్ష్మి(52) భర్త చనిపోయాడు. కొంతకాలంగా ఆమె చంపాపేట సిద్దార్థ స్కూల్ సమీపంలో తన కూతురు, కుమారుడితో కలిసి అద్దె ఇంట్లో నివసిస్తూ కూలీ పని చేసుకుంటోంది. హస్తినాపురం డీఆర్‌డీఎల్ కాలనీలో నివాసముండే బంధువుల వద్దకు వెళ్లేందుకు మధ్యాహ్నం తెలిసిన వారి స్కూటీపై వెళ్తున్నారు. ఈ క్రమంలో హస్తినాపురం జెడ్పీ రోడ్డులోని అగ్రికల్చర్ కాలనీ వద్దకు రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ స్కూటీని ఢీకొట్టింది. దీంతో స్కూటీపై ఉన్న ముగ్గురు కిందపడగా, లక్ష్మి టిప్పర్ వెనక చక్రాల కింద పడి తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలిలోనే మృతి చెందింది. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు.

విద్యార్థుల మృతిపై స్పందించరేమి?

చేవెళ్లలో ఏబీవీపీ నాయకుల నిరసన



ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

చేవెళ్ల: రోడ్డు మీద ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్‌ను తొలగిస్తే స్పందించిన నాయకులు, పాలకులు విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాలపై స్పందించకపోవడం దారుణమని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ కల్లెం సూర్యప్రకాశ్ అన్నారు. భువనగిరిలో ఇద్దరు విద్యార్థుల మృతికి కారణమైన వారిని గుర్తించి, వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలో ధర్నా నిర్వహించారు. నాణ్యమైన విద్య, ఉచిత భోజనం అందుతుందనే ఆశతో ప్రభుత్వ హాస్టళ్లలో చదువుతున్న పేద విద్యార్థులు శవాలుగా బయటకు రావడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. నగర కార్యదర్శి మహిపాల్, నాయకులు కిషోర్, విజయ్, ప్రవీన్, తరుణ్, శివకుమార్, విద్యార్థులు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

షాద్‌నగర్‌రూరల్: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని రాఘవేంద్రనగర్ కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు స్థానికులు తెలిపిన ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం చెదురుపల్లి గ్రామానికి చెందిన సువర్ణ అలియాస్ స్వప్న (26)కు మండల పరిధిలోని చింతగూడ గ్రామానికి చెందిన వ్యక్తితో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. సువర్ణ తండ్రి కృష్ణయ్య హైదరాబాద్‌లోని నందిహిల్స్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ కుటుంబ సభ్యులతో అక్కడే నివాసం ఉంటున్నారు. సువర్ణ భర్తను వదిలి తల్లిదండ్రుల వద్దే ఉంటుంది. శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడకు చెందిన గణేశ్ నందిహిల్స్ సమీపంలో ఓ వ్యక్తి వద్ద పనిచేస్తున్నాడు. గణేశ్, సువర్ణల పరిచయం పెళ్లిదాకా వెళ్లింది. దీంతో ఐదేళ్ల క్రితం వీరు యాదగిరిగుట్టలో రెండో వివాహం చేసుకున్నారు. అనంతరం వారు ఆరు నెలల క్రితం పని నిమిత్తం షాద్‌నగర్‌కు వలస వచ్చారు. భర్త ఇంట్లో లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు.